
గురుద్వారా వసంతబాల పాఠశాల రోడ్డు మీద వెలసిన బడ్డీలు


టీపీటీ కాలనీలోని జీవీఎంసీ స్థలంలో వెలసిన షెడ్లు, దుకాణాలు


నక్కవానిపాలెంలో ఫుట్‌పాత్‌ల మీద నిర్వహిస్తున్న వ్యాపారాలు

ఆక్రమణలమయం

- 24వ వార్డులో రోడ్లు, ఫుట్‌పాత్‌లపై అక్రమంగా దుకాణాల ఏర్పాటు
- రాకపోకలకు పాదచారుల అవస్థలు
- పట్టించుకోని జోన్‌–3 అధికారులు

సీతమ్మధార: జీవీఎంసీ 24వ వార్డులో రహదారులు, ఫుట్‌పాత్‌ల ఆక్రమణల పరంపర కొనసాగుతోంది. ఒకవైపు జీవీఎంసీ స్థలాల్లో ఆక్రమణలు.. మరోవైపు ఫుట్‌పాత్‌ల మీద దుకాణాల ఏర్పాటు కారణంగా పాదచారులు అవస్థలు పడుతున్నారు. ఫలితంగా రోడ్లపైనే నడుస్తూ ప్రమాదాలకు గురవుతున్నారు. వార్డులోని నక్కవానిపాలెం, సత్యం జంక్షన్, పీ అండ్ టీ కాలనీ, టీపీటీ కాలనీ, గురుద్వారా నుంచి సీతమ్మధార తహసీల్దార్ కార్యాలయం రోడ్డు ప్రాంతాల్లో స్మార్ట్‌సిటీ కింద జీవీఎంసీ లక్షల రూపాయలు వెచ్చించి ఫుట్‌పాత్‌లను సర్వాంగ సుందరంగా తీర్చిదిద్దింది. అవి నిర్మించిన కొద్ది రోజులకే ఆక్రమణలు షరామామూలు అయ్యాయి.


నక్కవానిపాలెంలో ఇందిరా గాంధీ పార్కు ఎదురుగా వెలసిన దుకాణాలు

ఆక్రమణలతో ట్రాఫిక్ సమస్యలు

◆ టీపీటీ కాలనీలోని ఎస్సీ హాస్టల్ సమీపాన గల జీవీఎంసీ స్థలంలో అక్రమంగా బడ్డీలు, పాన్‌షాపులు, ట్రావెల్స్ దుకాణాలు ఏర్పాటు చేశారు. ఇక్కడ షెడ్డు ఏర్పాటు చేసి నివసిస్తుండటం గమనార్హం.

◆ సత్యం జంక్షన్ నుంచి సీతమ్మధార అర్బన్ తహసీల్దార్ కార్యాలయానికి వెళ్లే రోడ్డుకు ఇరువైపులా ఫుట్‌పాత్‌ల మీద అంతులేని ఆక్రమణలు ఉన్నా.. టౌన్ ప్లానింగ్ అధికారులు పట్టించుకోవడం లేదని పాదచారులు ఆరోపిస్తున్నారు. పాన్‌షాపులు, పార్లర్లు, వాటర్‌క్యాన్, మెకానిక్ షెడ్లు, తోపుడు బండ్లు, టైర్ దుకాణాలు, టీ కొట్లు ఇష్టానుసారంగా ఏర్పాటు చేయడంతో ఫుట్‌పాత్‌లు మచ్చుకైనా కానరావడం లేదు.

◆ నక్కవానిపాలెం శివాలయం ప్రాంతంలో కొబ్బరిబొండాలు, ఇతర చిరు వ్యాపారాలు సాగుతున్నాయి. ఇక్కడి ఇందిరా గాంధీ పార్కు ఎదురుగా ఫుట్‌పాత్‌ల మీద కిరాణా, సైకిల్, ఐస్‌క్రీమ్, మోటార్ మెకానిక్ దుకాణాలు, పలు తోపుడు బండ్లు ఏర్పాటు చేశారు.

◆ గురుద్వారా వసంతబాల పాఠశాల రోడ్డులో పలు దుకాణాలు వెలిశాయి. ఒక వ్యక్తి ఆక్రమణలు చేసి మరీ బడ్డీలు అద్దెకిచ్చినట్టు ఆరోపణలు వినిపిస్తున్నాయి. ఇక్కడ జోన్‌–3 టౌన్ ప్లానింగ్ సిబ్బంది గతంలో కొన్ని బడ్డీలను తొలగించినా.. యథావిధిగా దుకాణాలు ఏర్పాటు చేయడం గమనార్హం. **వీటి కారణంగా ఈ** రోడ్డులో నిత్యం ట్రాఫిక్ రద్దీ **కనిపిస్తోంది. పాఠశాల**కు వచ్చి పోయే విద్యార్థులు, **ఉపాధ్యాయులు, సి**బ్బంది రాకపోకలు సాగించే **సమయంలో ట్రాఫిక్** ఇక్కట్లు తప్పడం లేదు.

◆ **వార్డుల్లోని పలు** ప్రాంతాల్లో రోడ్లు, ఫుట్‌పాత్‌ల **ఆక్రమణల కారణంగా** నిత్యం ట్రాఫిక్ జామ్ అవుతోంది. కొందరు చిరువ్యాపారులు ఏకంగా ఫుట్‌పాత్‌లు తవ్వేసి ఇనుప రాడ్లు సైతం ఏర్పాటు చేయడం గమనార్హం. జోన్‌–3 టౌన్ ప్లానింగ్ అధికారులు, ద్వారకా జోన్ పోలీసులు దృష్టి సారించి జీవీఎంసీ ఆస్తులకు నష్టం కలిగిస్తున్న వారిపై చర్యలు తీసుకోవాలని, ఆక్రమణలు తొలగించాలని స్థానికులు కోరుతున్నారు.

ఆక్రమణలు తొలగిస్తాం

24వ వార్డులో రహదారులు, ఫుట్‌పాత్‌ల ఆక్రమణల సమస్యను పరిశీలిస్తాం. త్వరలోనే పోలీసు శాఖ సమన్వయంతో ఆక్రమణలన్నీ తొలగిస్తాం. పాదచారుల రాకపోకలకు, ట్రాఫిక్‌కు ఇబ్బందులు లేకుండా చూస్తాం.

– వెంకటేశ్వరరావు, జోన్‌–3 టౌన్ ప్లానింగ్ ఏసీపీ, జీవీఎంసీ

'హాస్యానందం' పుస్తకావిష్కరణ


పుస్తకాన్ని ఆవిష్కరిస్తున్న సంపాదకుడు రాము

సీతంపేట: హాస్య కథా రచయిత గంగాధర్ వడ్లమన్నాటి సంకలనం చేసిన హాస్యానందం పుస్తకావిష్కరణ సభ శనివారం ద్వారకానగర్ పౌర గ్రంథాలయంలో జరిగింది. ముఖ్య అతిథి హాస్యానందం సంపాదకుడు పి.రాము పుస్తకాన్ని ఆవిష్కరించారు. మొదటి ప్రతిని కథా రచయిత ద్విభాష్యం రాజేశ్వరరావుకు అందజేశారు. ఈ సందర్భంగా ద్విభాష్యం మాట్లాడుతూ హాస్యం రాయడం చాలా కష్టమైన ప్రక్రియని అన్నారు. అటువంటికి 38 మంది రచయితలు రచించిన సుమారు 350 కథలతో పుస్తకాన్ని సంకలనం చేసిన గంగాధర్‌ను అభినందించారు. డాక్టర్ డి.వి.సూర్యారావు పుస్తక సమీక్ష చేశారు. మేడా మస్తాన్‌రెడ్డి వ్యాఖ్యాతగా వ్యవహరించారు. కార్యక్రమంలో డాక్టర్ డి.వి.జి.శంకరరావు, ఎం.సుగుణరావు, కోనె నాగవెంకట ఆంజనేయులు, బి.రత్నకుమారి, వాణి శ్రీనివాస్, సుసర్ల ఆర్వేశ్వరశాస్త్రి, పాల్గొన్నారు.

15 కిలోల గంజాయి స్వాధీనం

సీతమ్మధార: రామాటాకీస్ వద్ద 15 కిలోల గంజాయిని ద్వారకా జోన్ పోలీసులు స్వాధీనం చేసుకున్నారు. పోలీసులు తెలిపిన వివరాలిలా.. రామాటాకీస్ దరి ప్రభుత్వ నేత్ర వైద్యశాల వద్ద శుక్రవారం బరంపురం ప్రాంతానికి చెందిన ఒక వ్యక్తి ఒడిశా నుంచి విశాఖ వచ్చాడు. ఇక్కడి నుంచి బెంగళూరుకు గంజాయిని తరలించడానికి వెళ్తుండగా అనుమానాస్పదంగా అతడు కనిపించడంతో ద్వారకా పోలీసులు తనిఖీలు చేశారు. అతడి వద్ద 15 కిలోల గంజాయి స్వాధీనం చేసుకున్నారు. ద్వారకా సీఐ రమేష్ పర్యవేక్షణలో ఎస్ఐ ధర్మేంద్ర కేసు దర్యాప్తు చేస్తున్నారు.

క్లుప్తంగా

13న హిచ్‌కాక్ జయంతి సభ

సీతంపేట: ప్రపంచ మేటి సినీ **దర్శకుడు** ఆల్‌ఫ్రెడ్ హిచ్‌కాక్ 125వ జయం**తి సభ ఈ** నెల 13న ద్వారకానగర్ పౌర గ్రంథా**లయంలో** నిర్వహిస్తున్నట్టు వైజాగ్ ఫిల్మ్ సొసై**టీ కార్య**దర్శి నరవ ప్రకాశరావు ఒక **ప్రకటనలో** తెలిపారు. లండన్‌లో జన్మించిన **హిచ్‌కాక్,** సాంకేతిక పరిజ్ఞానం లేకున్నా 18, **19 శతా**బ్దాల్లో మంచి సినిమాలు అందిం**చారన్నారు.** అందుకే ఆయనను మాస్టర్ ఆఫ్ సస్పెన్స్ **అని** పిలుస్తారని చెప్పారు. హిచ్‌కాక్ గొప్పతనాన్ని నేటి తరానికి తెలిపేందుకు 125వ జయంతిని ఘనంగా నిర్వహిస్తున్నట్టు పేర్కొన్నారు. 13వ తేదీ సాయంత్రం 6 గంటలకు పౌర గ్రంథాలయంలో సమావేశం అనంతరం హిచ్‌కాక్ దర్శకత్వం వహించిన 'ది బర్డ్స్' చిత్రాన్ని ప్రదర్శిస్తామని, అందరికీ ఉచిత ప్రవేశం కల్పిస్తున్నట్టు తెలిపారు.

పౌర గ్రంథాలయం నిర్వహణ భేష్


లైబ్రరీలో విద్యార్థులతో మాట్లాడుతున్న రాష్ట్ర ఎస్టీ కమిషన్ చైర్మన్ శంకరరావు

సీతంపేట: రాష్ట్ర ఎస్టీ కమిషన్ చైర్మన్ డాక్టర్ డి.వి.జి.శంకరరావు శనివారం ద్వారకానగర్ పౌర గ్రంథాలయాన్ని సందర్శించారు. లైబ్రరీలోని అన్ని విభాగాలను పరిశీలించారు. ఉద్యోగార్థులకు కల్పించిన సౌకర్యాలపై సంతృప్తి వ్యక్తం చేశారు. ఒక మోడల్ గ్రంథాలయంగా నిర్వహిస్తున్నారని నిర్వాహకులను ఆయన అభినందించారు. విద్యార్థులు ఏయే పోటీ పరీక్షలకు సన్నద్ధమవుతున్నారో అడిగి తెలుసుకున్నారు. కొంతమంది విద్యార్థులు గ్రూప్‌–1కు ప్రిపేర్ అవడాన్ని అభినందించారు. ప్రభుత్వ గ్రంథాలయాలను కూడా ఇదే విధంగా తీర్చిదిద్దాలని శంకరరావు సూచించారు.

నేడు 'మీట్ అండ్ గ్రీట్'

మురళీనగర్: మురళీనగర్ వైశాఖీ స్పోర్ట్స్ పార్కు మహిళా భవన్‌లో వాకర్స్ ఇంటర్నేషనల్ సభ్యులతో ఆదివారం మీట్ అండ్ గ్రీట్ కార్యక్రమాన్ని నిర్వహించనున్నట్లు వాకర్స్ డిస్ట్రిక్ట్‌–101 ఎలక్ట్ గవర్నర్ కె.ద్వారకానాథ్ ఒక ప్రకటనలో తెలిపారు. ఉదయం 10 గంటలకు జరగనున్న ఈ కార్యక్రమంలో వాకర్స్ ఇంటర్నేషనల్ సెక్రటరీ జనరల్ సీలం ఐజాక్, అదనపు సెక్రటరీ జనరల్ రాళ్లపల్లి సత్యనాథం ముఖ్య అతిథులుగా పాల్గొంటారని చెప్పారు. ఈ సందర్భంగా వాకర్స్ డిస్ట్రిక్ట్‌–101 పరిధిలో నిర్వహించాల్సిన కార్యక్రమాలపై భవిష్యత్ ప్రణాళిక తయారు చేస్తామని, వాకర్స్ క్లబ్ సభ్యులు, కార్యవర్గ సభ్యులు పాల్గొనాలని ఆయన కోరారు.

రౌడీషీటర్‌ను గాయపరిచిన చిరువ్యాపారి

సీతమ్మధార: టిఫిన్ డబ్బులు ఇవ్వకపోవడంతో ఘర్షణ జరిగిన సంఘటన నాలుగో పట్టణ పోలీస్ స్టేషన్ పరిధిలో జరిగింది. పోలీసులు తెలిపిన వివరాలిలా.. ఫోర్త్‌టౌన్ పోలీస్ స్టేషన్ పరిధిలోని డైమండ్ పార్కు వద్ద అప్పలనాయుడు అనే వ్యక్తి ఒక తోపుడు బండి మీద పుల్కాల వ్యాపారం చేస్తున్నాడు. శుక్రవారం రాత్రి రౌడీషీటర్ రూపేష్ అక్కడ టిఫిన్ పార్సిల్ తీసుకున్నాడు. అతడిని అప్పలనాయుడు డబ్బులు అడగ్గా.. రూపేష్ ఇవ్వలేదు. దీంతో ఇద్దరి మధ్య మాటామాటా పెరిగి గొడవ జరిగింది. ఈక్రమంలో రూపేష్ తలపై అప్పలనాయుడు గాయపరిచాడు. అతడిని చికిత్స నిమిత్తం ఆస్పత్రికి తరలించారు. రూపేష్ ఫిర్యాదు మేరకు ఎస్ఐ వెంకటరావు పర్యవేక్షణలో పోలీసులు కేసు దర్యాప్తు చేస్తున్నారు.

కనకమహాలక్ష్మికి సహస్ర తులసీదళార్చన

దాబాగార్డెన్స్: బురుజుపేట కనకమహాలక్ష్మి అమ్మవారి దేవస్థానంలో శనివారం సహస్ర తులసీదళార్చన నిర్వహించారు. ఉదయం 7 నుంచి 8 గంటల వరకు జరిగిన ఈ పూజలో నలుగురు ఉభయదాతలు పాల్గొన్నారు. అమ్మవారి త్రికాల పంచామృతాభిషేక సేవలో పలువురు ఉభయదాతలు పాల్గొన్నారు. తులసీదళార్చనలో పాల్గొనదలిచే భక్తులు రూ.1,500, త్రికాల పంచామృతాభిషేక సేవలో పాల్గొనే భక్తులు రూ.1,000 పూజా రుసుం చెల్లించి పాల్గొనవచ్చని ఆలయ ఈవో పి.శ్రీనివాసులరెడ్డి తెలిపారు.

అలరించిన డ్యాన్స్ ఫెస్టివల్

సీతంపేట: స్వాతంత్య్ర దినోత్సవాన్ని పురస్కరించుకుని కీర్తి ఆర్ట్స్ అకాడమీ ఆధ్వర్యంలో శనివారం ద్వారకానగర్ పౌర గ్రంథాలయంలో నిర్వహించిన డ్యాన్స్ ఫెస్టివల్ అలరించింది. ఆంధ్ర, తెలంగాణ రాష్ట్రాలకు చెందిన 50 మందికి పైగా నృత్య కళాకారులు జానపద, కూచిపూడి, కథక్ ప్రదర్శనలు చేశారు. వీరిని తీర్చిదిద్దిన నాట్య గురువులు ఆర్.రజని, అనిల్ తెలికిచర్ల, సౌమ్య, మంగళ దివ్య, బి.సుధాపౌర్ణిమ, కరణం కుమార్‌లను అతిథులు మాజీ డిప్యూటీ మేయర్ దాడి సత్యనారాయణ ఫ్రెండ్స్ కామెడీ క్లబ్ అధ్యక్షుడు ఎం.వి.సుబ్రహ్మణ్యం, జబర్దస్త్ ప్రకాష్, బాదంగీర్ సాయి చేతుల మీదుగా సత్కరించారు. నృత్యంతో అలరించిన చిన్నారులను జ్ఞాపికలతో సత్కరించారు. ఈ సందర్భంగా అతిథులు మాట్లాడుతూ గురువుల వద్ద నేర్చుకున్న నాట్యకళను విడిచిపెట్టకుండా ప్రాక్టీస్ చేయాలన్నారు. నాట్యం దేవుడిచ్చిన వరమని, భక్తిశ్రద్ధలతో నేర్చుకుని కోరుకున్న రంగంలో రాణించాలని ఆకాంక్షించారు. కార్యక్రమంలో ఎం.వి.సుబ్రహ్మణ్యం, ఉమేష్ చంద్ర, కీర్తి అకాడమీ అధ్యక్షురాలు బిందు లీమ్మ కీర్తి పాల్గొన్నారు.


డ్యాన్స్ ఫెస్టివల్‌లో పాల్గొన్న కళాకారులకు జ్ఞాపికలు అందజేస్తున్న అతిథులు

గొల్ల బాబూరావుకు 'బొత్స' సత్కారం


గొల్ల బాబూరావును సత్కరిస్తున్న మాజీ మంత్రి బొత్స సత్యనారాయణ

మహారాణిపేట: రాజ్యసభ సభ్యుడు గొల్ల బాబూరావు జన్మదినం సందర్భంగా శనివారం మాజీ మంత్రి బొత్స సత్యనారాయణ ఆయనను స్వగృహంలో సత్కరించి, శుభాకాంక్షలు తెలిపారు. మాజీ మంత్రి కురసాల కన్నబాబు, మాజీ ఎమ్మెల్యే గొర్లె కిరణ్, జిల్లా ఎస్సీ విభాగం అధ్యక్షుడు బోని శివరామకృష్ణ తదితరులు పాల్గొన్నారు.

సుప్రీంకోర్టు ఆదేశాలతోనే నిరాశ్రయుల వసతిగృహాలు

సీతమ్మధార: సుప్రీం కోర్టు ఆదేశాలతోనే దేశంలోని అన్ని రాష్ట్రాల్లో నిరాశ్రయుల వసతి గృహాలు ఏర్పాటయ్యాయని ఏయూటీడీ స్వచ్ఛంద సంస్థ కార్యదర్శి ప్రగడ వాసు పేర్కొన్నారు. జ్ఞానాపురం సెయింట్ జోసఫ్ మహిళా కళాశాలకు చెందిన 25 మంది బీఎస్సీ ఫైనలియర్ విద్యార్థినులు శనివారం ఆర్టీసీ కాంప్లెక్స్ దరి టీఎస్సార్ కాంప్లెక్స్‌లోని ఏయూటీడీ–జీవీఎంసీ నిరాశ్రయుల వసతి గృహాన్ని సందర్శించారు. స్వచ్ఛంద సంస్థలు చేసే కార్యక్రమాలు, క్షేత్రస్థాయిలో ఎదురయ్యే సవాళ్లను తెలుసుకునేందుకు గాను కేస్ స్టడీస్ నిమిత్తం వారు వచ్చారు. ఈ సందర్భంగా వాసు మాట్లాడుతూ జీవీఎంసీ భవనాల్లో పలు స్వచ్ఛంద సంస్థలు నిరాశ్రయులైన మహిళలు, పురుషుల కోసం నిరాశ్రయుల వసతి గృహాలను నిర్వహిస్తున్నాయని తెలిపారు. టీఎస్సార్ కాంప్లెక్స్, భూపేష్ నగర్, మహారాణి పేట, పెద వాల్తేరు, ఆరిలోవ, బుచ్చిరాజుపాలెం తదితర ప్రాంతాల్లో ప్రస్తుతం నిరాశ్రయుల వసతి గృహాలు ఉన్నాయని చెప్పారు. రోడ్లపై తిరిగే నిరాశ్రయులను రెస్క్యూ ఆపరేషన్ ద్వారా వసతి గృహాలకు తరలించి పునరావాసం కల్పిస్తున్నామన్నారు. ఇంట్లో చెప్పకుండా పారిపోయి వచ్చే వారికి కూడా వసతి గృహాల్లో ఆశ్రయం కల్పించి, తరువాత వారిని స్వస్థలాలకు పంపుతున్నామని వివరించారు. కార్యక్రమంలో వసతి గృహం ప్రతినిధి జ్యోతిర్మయి, కళాశాల ప్రతినిధి సిస్టర్ దీపాలి, కేర్‌టేకర్లు పాల్గొన్నారు.


నిరాశ్రయుల వసతి గృహం నిర్వాహకులతో సెయింట్ జోసఫ్ కళాశాల విద్యార్థినులు

బీసీల సంక్షేమానికి ప్రభుత్వాలు కృషి చేయాలి

ఎంవీపీకాలనీ: దేశవ్యాప్తంగా బీసీల సంక్షేమానికి కేంద్రంతోపాటు ఆయా రాష్ట్ర ప్రభుత్వాలు కృషి చేయాలని అఖిల భారత బీసీ సంక్షేమ సంఘం జాతీయ అధ్యక్షుడు లగుడు గోవిందరావు కోరారు. ఎంవీపీ కాలనీలోని ఓ హోటల్‌లో సంఘ సభ్యులతో ఆయన శనివారం సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ బీసీ సామాజిక వర్గానికి జాతీయ స్థాయిలో తీవ్ర అన్యాయం జరుగుతోందన్నారు. దేశంలో అత్యధిక జనాభాగా బీసీలు ఉన్నప్పటికీ వారికి ఉద్యోగ, రాజకీయ, వ్యాపార రంగాల్లో తగిన భాగస్వామ్యం లభించడం లేదని ఆవేదన వ్యక్తం చేశారు. ఈ నేపథ్యంలో బీసీల అభ్యున్నతికి కేంద్రం, రాష్ట్ర ప్రభుత్వాలు ప్రత్యేక చర్యలు తీసుకోవాలని కోరారు. చట్టసభల్లో 50 శాతం రిజర్వేషన్లు అమలు చేయాలని, బీసీల సంక్షేమానికి కేంద్రం రూ.లక్ష కోట్ల బడ్జెట్‌ను కేటాయించడంతోపాటు ప్రత్యేకంగా బీసీ మంత్రిత్వ శాఖ ఏర్పాటు చేయాలని, బీసీ విద్యార్థులకు ఉపకార వేతనాలను రెట్టింపు చేయాలని, బీసీ కుల వృత్తులకు వంద శాతం సబ్సిడీతో రుణాలు అందించాలని విన్నవించారు. రాష్ట్రంలో త్వరలో భర్తీ చేయబోయే నామినేటెడ్ పోస్టుల్లో బీసీలకు పూర్తిస్థాయి ప్రాధాన్యం కల్పించాలని రాష్ట్ర ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో సంఘ నాయకులు పెదిరెడ్ల సత్యం, వరుదు రాజ్‌కుమార్, పెదిరెడ్ల శ్రీనివాస్‌రావు, బర్ల పైడం నాయుడు, గంగు మన్మధరావు తదితరులు పాల్గొన్నారు.


మాట్లాడుతున్న లగుడు గోవిందరావు

ఎల్‌ఐసీ బిల్డింగ్ సమీపంలో స్వల్పమంటలు


మంటలను ఆర్పుతున్న అగ్నిమాపక సిబ్బంది

తాటిచెట్లపాలెం: ఎల్‌ఐసీ బిల్డింగ్ ఎదురుగా గల రైల్వే క్వార్టర్స్ సమీపంలో శనివారం రాత్రి స్వల్ప మంటలు చెలరేగాయి. ఈ ప్రాంతంలో గల చెత్తకు ఆకతాయిలు నిప్పు పెట్టడం వల్ల ఈ మంటలు వ్యాపించాయని స్థానికులు తెలిపారు. సమాచారం అందుకున్న అగ్నిమాపక సిబ్బంది ఘటనా స్థలికి చేరుకుని మంటలను అదుపు చేశారు.

వాకింగ్ చేస్తూ వృద్ధుడి మృతి

మర్రిపాలెం: కంచరపాలెం ఐదో పట్టణ పోలీస్ స్టేషన్ పరిధిలో ఓ వృద్ధుడు వాకింగ్‌కు వెళ్లి మృతి చెందిన ఘటన జరిగింది. పోలీసులు తెలిపిన వివరాలిలా.. కంచరపాలెం ధర్మానగర్‌లో నివసిస్తున్న అల్లి సింహాద్రి(75) శనివారం మధ్యాహ్నం భోజనం అనంతరం ఇంట్లో చెప్పకుండా అలా నడుచుకుంటూ బయటకు వెళ్లాడు. ఈ క్రమంలో ఆశీర్వాద్ ఫంక్షన్ హాల్ దగ్గర రోడ్డుపై ఒక్కసారిగా కుప్పకూలి పడిపోవడాన్ని స్థానికులు గమనించి వెంటనే 108కు కాల్ చేశారు. అక్కడ నుంచి అంబులెన్స్‌లో ఆస్పత్రికి తీసుకు వెళ్తుండగా అప్పటికే మృతిచెందాడని వారు చెప్పారు. విషయం తెలుసుకున్న పోలీసులు వృద్ధుడి కుటుంబ సభ్యుల కోసం ఆరా తీసి వారికి సమాచారం అందించారు. సింహాద్రి వృద్ధుడు కావడం, లో బీపీ ఉండటం, మద్యం తాగే అలవాటు ఉండటంతో మృతిచెంది ఉండవచ్చని వారు భావిస్తున్నారు. కుటుంబ సభ్యుల ఫిర్యాదు మేరకు సీఐ ఎస్.భాస్కరరావు నేతృత్వంలో హెడ్ కానిస్టేబుల్ వి.వి రమణ కేసు దర్యాప్తు చేపట్టారు. వృద్ధుడు సింహాద్రి డప్పులు కొడుతూ ఉంటాడని పోలీసులు తెలిపారు.


సింహాద్రి మృతదేహం

క్రైస్తవుల శాంతియుత ర్యాలీ

సీతమ్మధార: కేంద్ర ప్రభుత్వం అమలు చేస్తున్న మత వివక్షతో కూడిన చట్టాలు, చేస్తున్న దాడులకు వ్యతిరేకంగా క్రైస్తవ ప్రగతి పరిరక్షణ సమాఖ్య (సీపీఐసీ) ఆధ్వర్యంలో శనివారం శాంతియుత ర్యాలీ నిర్వహించారు. క్రైస్తవ మైనారిటీల పట్ల వివక్ష ప్రదర్శిస్తూ 1950 ఉత్తర్వులకు నిరసగా జీవీఎంసీ గాంధీ విగ్రహం పార్కులో నిరసన ప్రదర్శన నిర్వహించారు. ఈ సందర్భంగా వక్తలు మట్లాడుతూ 1960లో అప్పటి రాష్ట్రపతి బాబూ రాజేంద్రప్రసాద్ క్రైస్తవ మైనారిటీలకు మాత్రమే వర్తించేలా మత స్వతంత్ర నిరోధక చట్టాలకు తెరలేపారని గుర్తు చేశారు. ఫలితంగా ఆగస్టు 10న బ్లాక్‌డేగా ప్రకటించి దేశవ్యాప్తంగా నిరసన ప్రదర్శనలు చేపట్టామని తెలిపారు. రెండు తెలుగు రాష్ట్రాల్లోను మతం మారిన క్రైస్తవ మైనారిటీలకు కుల నిర్మూలన చేస్తూ అదర్ క్రిస్టియన్ పేరిట ధ్రువీకరణ పత్రాలు ఇస్తున్నారని పేర్కొన్నారు. రాజ్యాంగం కల్పిస్తున్న ప్రాథమిక హక్కులకు భంగం కలిగిస్తున్న చట్టాల నుంచి విముక్తి కల్పించాలని కోరారు. అంతకు ముందు అధిక సంఖ్యలో క్రైస్తవులు, సమాఖ్య సభ్యులు పలు ప్రాంతాల మీదుగా శాంతియుత ర్యాలీ నిర్వహించారు. ఈ కార్యక్రమంలో సమాఖ్య ప్రతినిధులు ఎం.సుధాకర్‌పాల్, జేమ్స్ కుంపట్ల, కె.ఈశ్వర్ డేనియల్, ఎస్.హనీ జాన్సన్, బిషప్ ఎంఏ పాల్, పలు క్రైస్తవ సంఘాల నాయకులు పాల్గొన్నారు.



నిరసన ర్యాలీలో పాల్గొన్న క్రైస్తవులు

వైభవుడికి సుప్రభాత సేవ

మురళీనగర్: కప్పరాడ ఎన్‌జీజీవోస్ కాలనీలో వెలసిన వైభవ వేంకటేశ్వర స్వామికి శనివారం సుప్రభాత సేవ ఘనంగా నిర్వహించారు. తెల్లవారుజామున సన్నిధిగొల్ల సేవ చేసి సుప్రభాతం చదివి వినిపించారు. ఆలయ అర్చకుడు శేషాచార్యులు ఆధ్వర్యంలో ఉదయం 7.30 గంటలకు బాలభోగం, 9.30 గంటలకు భక్తుల సమక్షంలో శ్రీవారికి అర్చన, మంగళాశాసనం, తీర్థప్రసాద గోష్ఠి, 10 గంటలకు సామూహిక విష్ణు సహస్ర నామార్చన, 11.30 గంటలకు రాజభోగ నివేదన జరిగాయి. మధ్యాహ్నం 300 మంది భక్తులకు అన్నదానం చేశారు. సాయంత్రం వైభవుడికి నక్షత్ర, కర్పూర, కూష్మాండ , కుంభ హారతులు సమర్పించారు. ఆలయ కార్యనిర్వహణాధికారి బండారు ప్రసాద్ ఏర్పాట్లు పర్యవేక్షించారు.

విద్యార్థులు లక్ష్యసాధన దిశగా సాగాలి

అల్లిపురం: విద్యార్థులు లక్ష్యసాధన దిశగా ముందుకు వెళ్లాలని నగర పోలీస్ కమిషనర్ డాక్టర్ శంఖబ్రత బాగ్చి అన్నారు. సూర్యాబాగ్ పోలీస్ క్వార్టర్స్‌లో గల పబ్లిక్ అండ్ పోలీస్ అసోసియేషన్ ఫర్ స్ట్రీట్ చిల్డ్రన్ (పాపాహోం) కమిటీ ఆధ్వర్యంలో శనివారం ఏర్పాటు చేసిన వైద్య శిబిరాన్ని ఆయన జ్యోతి వెలిగించి ప్రారంభించారు. సంపూర్ణ ఆరోగ్యంతో లక్ష్య సాధన దిశగా అందరూ ముందుకు వెళ్లాలన్నారు. విద్యార్థి దశ ప్రాముఖ్యతను వివరించారు. పాపాహోం అభివృద్ధికి తోడ్పడుతున్న కమిటీ సభ్యులను, దాతలను సీపీ అభినందించారు. గౌరవ అతిథిగా విచ్చేసిన కేజీహెచ్ సూపరింటెండెంట్ డాక్టర్ పి. శివానంద్ మాట్లాడుతూ ప్రతి విద్యార్థి అబ్దుల్ కలాంను ఆదర్శంగా తీసుకుని అత్యున్నత శిఖరాలు అధిరోహించాలన్నారు. ఈ సందర్భంగా సీపీ స్వయంగా విద్యార్థులకు వైద్య పరీక్షలు నిర్వహించారు. పాపాహోం అధ్యక్షుడు డి.సూర్యప్రకాశరావు అధ్యక్షతన జరిగిన ఈ కార్యక్రమంలో డాక్టర్ అస్లామ్ అరిఫ్, కార్యదర్శి వీఎస్ ప్రకాశరావు, కోశాధికారి రమేష్‌చంద్ జైన్, హెల్త్ క్యాంప్ కో ఆర్డినేటర్ డాక్టర్ కేబీ స్వామి, పాపాహోం సభ్యులు ఎంవీ రాజశేఖర్, ఎంవీవీ సత్యనారాయణ, కృష్ణారావు ఆచారి, భాస్కర శ్రీనివాస్, వెంకటేశ్వరరావు, సిబ్బంది పాల్గొన్నారు.


విద్యార్థికి వైద్య పరీక్షలు చేస్తున్న పోలీస్ కమిషనర్ డాక్టర్ శంఖబ్రత బాగ్చి

మహిళా కళాశాలలో 'వన్ క్యాడెట్ వన్ ప్లాంట్'

దాబాగార్డెన్స్: విశాఖ ప్రభుత్వ మహిళా డిగ్రీ కళాశాలలో స్వాతంత్య్ర దినోత్సవ వేడుకల్లో భాగంగా శనివారం 'వన్ క్యాడెట్ వన్ ప్లాంట్' కార్యక్రమం నిర్వహించారు. కళాశాల ఎన్‌సీసీ అధికారి కె. గీతాంజలి నేతృత్వంలో ఈ కార్యక్రమం చేపట్టారు. ఈ సందర్భంగా కళాశాల ఆవరణలో మొక్కలు నాటారు. చెట్లను కాపాడడంపై అవగాహన కల్పించే విషయమై ఈ కార్యక్రమం నిర్వహించినట్టు కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ ఆర్. మంజుల తెలిపారు. చెట్లు ప్రకృతి ప్రసాదించిన అమూల్య వరమని, చెట్ల వల్లే ఈ పచ్చని భూమి, మన జీవితం ఆనందంగా ఉంటుందన్నారు. కార్యక్రమంలో కళాశాల ఫిజికల్ డైరెక్టర్ డాక్టర్ ఆర్. కిరణ్మయి, డాక్టర్ కేఎల్ శిరీష, డాక్టర్ జె. లావణ్య, ఎస్. అనురాధ, అధ్యాపక బృందం, ఎన్‌సీసీ క్యాడెట్లు పాల్గొన్నారు.


కళాశాల ప్రాంగణంలో మొక్కలు నాటుతున్న ఎన్‌సీసీ క్యాడెట్లు, అధ్యాపకులు

ఘనంగా తేరు ఊరేగింపు

కంచరపాలెం: జ్ఞానాపురం పరిధి పునీత పేతురు ప్రధాన దేవాలయంలో పారిస్ పాస్టిల్ కౌన్సిల్, విచారణ గురువులు ఫాదర్ జొన్నాడ జాన్ ప్రకాష్ సంయుక్త ఆధ్వర్యంలో శనివారం సాయంత్రం తేరు మహోత్సవం నిర్వహించారు. తేరు ఉత్సవంలో దేవవర ప్రసాదాల మాత అవతారంలో దేవమాత తేరు (పల్లకి) ఉత్సవం నిర్వహించారు. స్లీప్‌గుర్తువీధి, రే బరిల్, సిరిల్ మాన్యువల్, డయాస్, నికోలస్ తదితర వీధుల్లో ఊరేగించారు. కార్యక్రమంలో పీపీసీ సభ్యులు, అధిక సంఖ్యలో క్రైస్తవులు పాల్గొన్నారు.


మేరీమాత స్వరూపాన్ని తేరులో మోస్తున్న క్రైస్తవులు